నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్‌ ఏఈ ఎస్‌.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జాగృతి కాలనీ, కొండాపూర్‌ బెటాలియన్‌ రోడ్డు, గోల్డెన్‌ తులీప్‌ పార్క్, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు కొండాపూర్‌ 8వ బెటాలియన్‌ పరిసరాలు, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాఘవేంద్ర కాలనీ సీ,డి బ్లాక్‌లు, స్విమ్మింగ్‌ పూల్, హైటెన్షన్‌ లేన్‌ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్‌ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు

- 11 కేవీ నల్లగండ్ల హుడా ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నల్లగండ్ల హుడా కాలనీ ఏరియాలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తారు.
- 11 కేవీ లక్ష్మీ విహార్‌ ఫీడర్‌ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు లక్ష్మీవిహార్‌ ఫేజ్‌–1 కాలనీ, ఫేజ్‌–2 కాలనీ, డాక్టర్స్‌ కాలనీ, డిఫెన్స్‌ కాలనీ, నవోదయ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని ఏఈ తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: న్యూకాలనీ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు న్యూ కాలనీ, లక్ష్మీనగర్, నరేన్‌ గార్డెన్‌ ప్రాంతాలు, అదేవిధంగా 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు డోవా కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డు, లక్ష్మీనగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని ఏఈ రవిచంద్ర తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్ : హఫీజ్‌పేట్, మదీనాగూడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- వైశాలీనగర్‌ ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఏపీజీఓ కాలనీ, వైశాలీనగర్‌ పూర్తిగా, శారదనగర్‌ కాలనీ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- హనుమాన్‌ టెంపుల్‌ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు మదీనాగూడ మల్లన్న టెంపుల్, మదీనాగూడ మెయిన్‌ రోడ్డు నుంచి ప్రణామ్‌ హాస్పటల్‌ వరకు, కృష్ణ కాలనీ ప్రాంతాలలో..

వేమనకాలనీ సెక్షన్‌ పరిధిలో...

వేమనకాలనీ, మదీనాగూడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో..

- ఇక్రిశాట్‌ ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు అయ్యప్పస్వామి, ఆర్వీ నిర్మాణ్, కెఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్, అపర్ణ రోడ్డు ఏరియాలలో..
- సీబీఆర్‌ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సీబీఆర్, శ్రీ దుర్గ ఎస్టేట్స్, జీహెచ్‌ఎంసీ పార్కు, దీప్తిశ్రీనగర్‌ రోడ్డు నంబర్‌ 14 ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదని ఏఈ దీప్తి పేర్కొన్నారు.

సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌ సర్వే

- డీజీపీఎస్‌ ద్వారా 21 పాయింట్లు సేకరణ
- సర్వేను అడ్డుకునేందుకు యత్నించిన స్థానికులు



అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

మాదాపూర్: మాదాపూర్‌ సియట్‌ కాలనీలోని సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌ ప్రాంతాన్ని గురువారం రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు సర్వే చేశారు. డిఫరెన్షియల్‌ గ్లోబల్‌ పొజిషినింగ్‌ సిస్టమ్‌ ద్వారా 21 పాయింట్ల ఆధారంగా సున్నం చెరువు ప్రాంతాన్ని సర్వే చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న వారు మాకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నించారు. సున్నం చెరువు మొత్తం 15.5 ఎకరాలు అయితే ఇప్పుడు అధికారులు 32 ఎకరాలు ఉందంటున్నారని మేము కష్టపడి కొనుక్కున్న స్థలంలో ఎఫ్‌టీఎల్‌ ఉందని ఖాళీ చేయమంటే ఎలా అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సున్నం చెరువు విస్తీర్ణం 32 ఎకరాలని ఇరిగేషన్‌ అధికారులు, 24 ఎకరాలని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని, దీనిపై సరైన స్పష్టత ఇవ్వాలన్నారు. కాగా పేదలకు అన్యాయం జరిగితే ఊరుకోమని మాదాపూర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ నాయకుడు కార్తీక్‌ తెలిపారు. పేదలను ఇబ్బందులు పెట్టడం సరైనది కాదన్నారు.

ఉరుములు.. మెరుపులు..
భారీ వర్షం

లింగంపల్లి–గచ్చిబౌలి ప్రధానరోడ్డు జలమయం

రోడ్లపై కూలిన చెట్లు.. సెల్లార్లలోకి వరద నీరు



లింగంపల్లి- గచ్చిబౌలి ప్రధాన రోడ్డులో దోయన్స్‌కాలనీ వద్ద భారీగా వరదనీరు



నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో ..



నల్లగండ్ల- గోపన్‌పల్లి ప్రధాన రోడ్డులో..



చందానగర్‌లోని వ్యాపార సముదాయాల సెల్లార్లలో వరద నీరు

శేరిలింగంపల్లిజోన్‌ బృందం: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్‌ డివిజన్ల లోని కాలనీలు, బస్తీలలో రోడ్లు జలమయమయ్యాయి. పలుచోట్ల ఇబ్బందులు తలెత్తాయి. శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ బోర్ఖడే ఆదేశంపై రెండు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది వరదనీరు నిలువకుండా చర్యలు చేపట్టారు. పలు చోట్ల ప్రధాన, అంతర్గత రోడ్లు వర్షం ధాటికి గుంతలు పడడమే కాకుండా కంకర తేలాయి.

లింగంపల్లి అండర్‌బ్రిడ్జి కింద భారీగా వరదనీరు..

లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరింది. ఇక్కడ రూ.4 కోట్ల వ్యయంతో డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణం చేసిన విషయం తెలిసిందే. భారీగా వరద నీరు చేరినా రెండు గంటల్లో నాలాల్లోకి వెళ్ళిపోవడంతో మార్గం సుగమమైంది. హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రధాన రోడ్లపై పలుచోట్ల చెట్లు కూలిపోయాయి.

చందానగర్‌లో సెల్లార్లలోకి వరదనీరు... మోటార్లతో తొలగింపు

చందానగర్‌లోని పలు వ్యాపార సముదామాల్లోని సెల్లార్లలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. మోటార్లు పెట్టి వెంటనే తొలగించారు. దాదాపు పది మోటార్లతో సెల్లార్లలోని నీటిని తొలగించారు.



తారానగర్‌లోని పోచమ్మ దేవాలయం రోడ్డులో ..



లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద చేరిన వరద నీరు



చందానగర్‌లో పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ





దోయన్స్‌కాలనీలో లింగంపల్లి-గచ్చిబౌలిరోడ్డులోని పెట్రోల్‌బంకు ఆవరణలో వరదనీరు



ఇసుక, కంకర తేలిన దీప్తిశ్రీనగర్ రోడ్డు







హెచ్‌సీయూలో కూలిన చెట్లు, ఒరిగిన స్ట్రీట్‌ లైట్‌ స్తంభం



వరదనీటిలో వాహనాలు

అమ్మమాట.. అంగన్వాడీ బడిబాట



గ్రాడ్యుయేషన్‌ డేలో సీడీపీఓ కవిత, టీచర్లు

చందానగర్: శేరిలింగంపల్లి ప్రాజెక్టు గోపీనగర్‌ సెక్టార్‌ చందానగర్‌లోని రాజీవ్‌నగర్‌లోని అంగన్వాడీ సెంటర్‌లో అమ్మమాట– అంగన్వాడీ బడిబాట కార్యక్రమంను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్లు మాధురి, కోమలి హాజరై 5 సంవత్సరాలలోపు చిన్నారులను చేర్పుకున్నారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్‌ డే నిర్వహించారు. అనంతరం బస్తీలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్‌ నాగమణి, సువర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 26 మంది లబ్ధిదారులకు మంజూరైన 10 లక్షల 64 వేల 500 రూపాయల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఎమ్మెల్యే గాంధీ, గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తంలా ఆదుకుంటున్నదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు సమ్మారెడ్డి, కోనేరు ప్రసాద్, శివరాజుగౌడ్, పోశెట్టి గౌడ్, గోపాల్, లింగం, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభం

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటిరోజు హాజరుశాతం తగ్గింది. శేరిలింగంపల్లి మండల పరిధిలో 59 ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి రోజు 40 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. కొత్తగూడలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే గాంధీ, విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మీ, మండల విద్యాధికారి వెంకటయ్య పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ చేశారు.

తనిఖీలు

శేరిలింగంపల్లి మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను గురువారం మండల విద్యాధికారి వెంకటయ్య తనిఖీ చేశారు. మదీనాగూడ, హఫీజ్‌పేట్, కొత్తగూడలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, స్కూల్‌ యూనిఫామ్‌ పంపిణీ తదితరాలను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో సమావేశమై బోధన, తరగతుల నిర్వహణ, హాజరు శాతం పెంచడం, కొత్తగా పాఠశాలలో విద్యార్థుల చేరిక వంటి అంశాలపై ఆయన చర్చించారు.



నటి కల్పికపై కేసు నమోదు

గచ్చిబౌలి: ప్రిజం పబ్‌ ఘటనలో కోర్టు అనుమతితో నటి కల్పికపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. మే 29న నటి కల్పిక స్నేహితులతో కలిసి ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్‌కు వెళ్లింది. కేక్‌ విషయంలో కల్పిక పబ్‌ సిబ్బందితో వాగ్వాదానికి దిగింది. సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని, డ్రగ్‌ అడిక్ట్‌ అంటూ దూషించారని, ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆమె సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేసిన వీడియో వైరల్‌ అయిన విషయం తెలిసిందే. పబ్‌లో బిల్లు చెల్లించకుండా సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించిందని, బాడీ షేమింగ్‌ చేసి బూతులు తిట్టిందని సిబ్బంది గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు కోర్టు అనుమతి తీసుకొని నటి కల్పికపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో ఎనిమిది మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఎనిమిది మందికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

ఫిట్‌నెస్‌ లేని 4 స్కూల్‌ బస్సులు సీజ్‌



బస్‌లను సీజ్‌ చేసిన ఆర్టీఏ అధికారులు

చందానగర్ : పాఠశాలలు పునఃప్రారంభమైన వేళ హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధి ఆల్విన్‌ చౌరస్తాలో ఫిట్‌నెస్‌ లేని 4 స్కూలు బస్సులను కొండాపూర్‌ ఆర్టీఏ అధికారి నవీన్‌ గురువారం సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఐ ప్లే స్కూల్, మాటూరి వెంకట సుబ్బారావు ఇంజనీరింగ్, ఐరిస్‌ ఫ్లోరెట్స్‌ స్కూల్, సింగింగ్‌ బౌల్‌ ప్లే స్కూల్‌ అండ్‌ డే కేర్‌లకు సంబంధించిన బస్సులు ఫిట్‌నెస్, పర్మిట్, ఫస్ట్‌ ఎయిడ్‌ మంటలను ఆర్పే పరికరం లేకపోవడంతో సీజ్‌ చేసినట్లు తెలిపారు. ప్రతి స్కూల్‌ బస్‌కు సరైన పత్రాలు ఉండాలన్నారు.

ముంపు ప్రాంతాలలో జడ్సీ పర్యటన



చందానగర్ : హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన మదీనాగూడ, రామకృష్ణనగర్, దత్తసాయి కాలనీ, మదీనాగూడ ప్రభుత్వ పాఠశాల ప్రాంతాలలో శేరిలింగంపల్లి జోన్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ భోర్కడే, చందానగర్‌ సర్కిల్‌– 21 ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈ శంకర్‌ నాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్‌లు పర్యటించారు. డీఈ శ్రీదేవి, ఏఈ ప్రతాప్, నాయకులు అలీ, మిరియాల రాఘవరావు, ఉరిటి వెంకట్రావు, కట్ల శేఖర్‌రెడ్డి, సౌందర్యరాజన్, సాయిగౌడ్, నాగ మహేష్, శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు. అలాగే మదీనాగూడ ప్రభుత్వ పాఠశాలలోకి వర్షపు నీరు చేరడంతో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్, స్థానిక నాయకులు పాఠశాలను పరిశీలించారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

రాయదుర్గం: ప్రజావసరాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ సమగ్ర, సంతులిత అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో రూ.4.51 కోట్లతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల పనులకు గురువారం కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మారుస్తున్నామన్నారు. కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్జీఓఆర్‌కాలనీ, గోపన్‌పల్లితండాలో రూ.78.50 లక్షలతో, తాజ్‌నగర్, గోపన్‌పల్లి తండాలో రూ.73 లక్షలతో, గోపన్‌పల్లితండాలో రూ.90 లక్షలతో సీసీరోడ్లు, నానక్‌రాంగూడ జనచైతన్యకాలనీలో రూ.80 లక్షలతో మంచినీటి పైప్‌లైన్‌ పనులను చేపట్టడం జరిగిందని వివరించారు. జలమండలి డీజీఎం నరేందర్‌రెడ్డి, డీఈ విశాలాక్షి, ఏఈ రషీద్, నాయకులు శివాసింగ్, రాజు, సుమన్, రంగస్వామి, సత్యనారాయణ, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్‌లు అందజేత



యూనిఫాంలు అందజేస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి హైస్కూల్, సురభి కాలనీ ప్రైమరీ స్కూల్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌ విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా నాగేందర్‌ యాదవ్‌ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరం అని శేరిలింగంపల్లి హైస్కూల్‌కు రూ.లక్షతో స్పోర్ట్స్‌ మెటీరియల్‌ అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నప్రభ, ఇంచార్జ్‌ ప్రధానోపాధ్యాయులు బల్వంత్‌రెడ్డి, సురభి కాలనీ ప్రధానోపాధ్యాయులు పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.